ప్రజాశక్తి
బుధవారం 24 డిసెంబర్ 2025

అల్లూరి సీతారామరాజు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం పాఠశాలలో జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి సత్కరించారు. 20 ఏళ్ల తరువాత ఉపాధ్యాయులతో కలుసుకున్న వారంతా పూర్వపు మధుర జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు.. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు, ప్రస్తుత సర్పంచ్, చింతపల్లి మండలాల విద్యాశాఖ అధికారులు నారాయణ, గెమ్మెల బోడం నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు కసా వెంకట రమణ, గాజుల ప్రభాకర్, రమణమూర్తి, డ్రాయింగ్ మాస్టర్ బాలాజీ, పద్మనాభం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై ఆందోళన

★ సిఐటియు ఆధ్వర్యాన 104 ఉద్యోగుల నిరసన దీక్ష

: పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట నిరసనలో 104 ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉద్యోగులపై భవ్య యాజమాన్యం వేధింపులు, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్తూ 104 ఎంఎంయు ఉద్యోగులు మంగళవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా నాయకులు రామ్మూర్తి, సూర్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 104 ఉద్యోగులు సమస్యలను తక్షణం పరిష్కరించాలని, ఉద్యోగులపై భవ్య యాజమాన్యం వేధింపులు ఆపాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కొంతకాలంగా తమ సమస్యలపై ఉద్యమిస్తూ, అనేకమార్లు విన్నవించినా ప్రభుత్వం పరిష్కారచర్యల్లో నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. 104న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వల్లే రాష్ట్రవ్యాప్తంగా నిరసన దిగాల్సి వచ్చిందన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయక భవ్య సంస్థ 104 ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. 104 ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర అధికారులకు తెలియజేసినందుకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సస్పెన్షన్‌ను నిరసిస్తూ తక్షణమే ఎత్తేయాలని, భవ్య యాజమాన్యం తగ్గించిన జీతాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, సంవత్సరానికి 15 క్యాజువల్ లీవ్స్ ఇవ్వాలని, గుర్తింపుకార్డులు ఇవ్వడంతోపాటు, ఏడునెలలుగా నిలుపుదల చేసిన పేస్లిప్పులు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో బీపీ, షుగరు, ఫిట్స్ ఇతర దీర్ఘకాలిక వ్యాధ్యులతో బాధపడుతున్న ప్రజలందరికి మందులు పూర్తిస్థాయిలో ఇవ్వాలని కోరారు. అరబిందో యాజమాన్యం ఇవ్వాల్సిన బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించాలని కోరారు. తక్షణం సమస్యలు పరిష్కరించకపోతే సిఐటియు అనుబంధ సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పిహెచ్‌సిలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 104 ఉద్యోగులు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, పాడేరు మండల కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం

పాడేరులో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న సిఐటియు నేతలు

● పాడేరులో సిఐటియు ఆధ్వర్యాన నిధి సేకరణ

ప్రజాశక్తి-పాడేరు : సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం సిఐటియు నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. దుకాణాలు, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ మహాసభ జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 31 నుండి వచ్చేనెల 4న వరకు విశాఖలో జరిగే మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. మహాసభ చివరి రోజు 4న విశాఖలో కార్మిక ప్రదర్శన, ఆర్‌కె. బీచ్‌లో భారీ బహిరంగ సభకు కార్మిక వర్గం కదలి రావాలని విజ్ఞప్తి చేశారు. పాడేరు జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు, పాడేరు మండల కన్వీనర్ ప్రసాద్ ఇతర కార్యకర్తలతో కలిసి వీధుల్లో ప్రచారం నిర్వహించి, నిధి సేకరణ చేపట్టారు. ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కార్మికుల హక్కులను హరిస్తూ, వారికి నష్టం చేకూర్చేలా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, కార్మికుల భద్రత, ప్రైవేటీకరణ నుంచి ప్రభుత్వరంగ పరిరక్షణ, అలాగే రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన పనిగంటల పెంపు నిర్ణయం వెనక్కు తీసుకునే వరకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని, దానికి సిఐటియు అఖిల భారత మహాసభ దిశానిర్దేశం చేస్తుందన్నారు. అన్ని వర్గాల కార్మికులు, ప్రజలు కదిలి వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సురేంద్ర, తదితరులు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలో రంగిలిసింగి పంచాయతీ కింజేరి గ్రామంలో శారద ట్రస్టు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర ఆధ్వర్యంలో 100 మందికి దుప్పట్లును మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలో కనిష్ఠస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదై, చలిగాలులతో ఆది వాసులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం కేజీహెచ్ పూర్వ సూపరెంటిండెంట్ డాక్టర్ మన్మథరావు జ్ఞాపకార్థం చలితో ఇబ్బందులు పడుతున్న వంద మందికి దుప్పట్లు అందించడంపై దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు పి సత్యనారాయణ, మండల నాయకులు పిమోహన్‌దాస్, పి.శ్రీను ,పంచాయతీ ఉప సర్పంచ్ కొర్ర దాస్, పి డోంబు, రామస్వామి, భగవాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నవరం ఎస్‌ఐగా సాయిరామ్

ఎంఎస్‌పి మిశ్రాను కలిసిన ఎస్‌ఐ సాయిరాం

ప్రజాశక్తి-చింతపల్లి : అన్నవరం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా కె.సాయి రామ్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం తొలి పోస్టింగ్‌గా అన్న వరం పోలీస్ స్టేషన్‌కు నియమితులైన ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎస్సై సాయిరామ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో తొలిసారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం గర్వంగా ఉందన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు సమిష్టిగా కృషి చేస్తానని చెప్పారు.

అరకులో అటకెక్కిన ప్లాస్టిక్ నిషేధం

- ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్న పర్యాటక కేంద్రం
- ఎటు చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, బీరు బాటిల్స్ దర్శనం
- అవస్థలు పడుతున్న గిరిజన రైతులు, వాహనదారులు

ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ఉన్న గద్యగుడలోని సిల్వర్ తోట.

ప్రజాశక్తి- అరకులోయ : పర్యాటక కేంద్రమైన అరకు లోయలో ప్లాస్టిక్ నిషేధం అటకెక్కిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సింగిల్ యూజ్. ప్లాస్టిక్ నిషేధించాలని ఎన్నిమార్లు అధికారులు ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నప్పటికీ, ఇక్కడ ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. అరకులోయ టౌన్‌షిప్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రస్తుతం పర్యాటక సీజన్ కావడంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, బీర్ బాటిల్సే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్‌ను నిషేధించడంలో అధికారులు, పంచాయతీ యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలని నోటీసులిచ్చిన కొద్ది రోజులు మాత్రమే అమలు జరుగుతున్నా, తర్వాత యధావిధిగా ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం కొనసాగిస్తున్నారు. దీంతోపాటు అరకులోయకు వచ్చే పర్యాటకులు ప్లాస్టిక్ సంచులు, కవర్లు,వాటర్ బాటిల్స్, వాటర్ ప్యాకెట్స్ తీసుకొచ్చి ,వాటిని వాడేసిన తర్వాత ఎక్కడికక్కడే పడేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా, పంట పొలాల్లో కూర్చుని భోజనాలు చేసేచోట, గుంపులుగా మద్యం తాగేచోట కనిపించే ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతరత్రా చెత్తాచెదారమే దీనికి నిదర్శనం. దీంతో స్థానికులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.మద్యం తాగిన తర్వాత కొంతమంది పర్యాటకులు బీరు బాటిళ్లను పగలగొట్టి రోడ్లపైనా పంట పొలాలపై విసిరేస్తుండడంతో ఈ ప్రాంతంలోని గిరిజన రైతులతోపాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి నెలకొంది. ఒకపక్క ప్రభుత్వం స్వచ్ఛంద్ర- స్వర్ణాంధ్ర లక్ష్యంగా నినాదాలు చేస్తూ ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, పర్యాటక కేంద్రమైన అరకులో మాత్రం అందుకు భిన్నంగా ఉండడం గమనార్హం. కొత్తభల్లుగూడా పంచాయతీ పరిధిలో రోడ్ల ఇరువైపులా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

సిమిలిగూడ రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద రోడ్డుకిరువైపులా ఖాళీ బీర్ బాటిల్స్ ప్లాస్టిక్ వ్యర్థాలు

పర్యాటకులు అధికంగా ఉండే చోట్ల రోడ్ల ఇరువైపులా కనీసం డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించి, అరకులోయను సందర్శించే పర్యాటకులు ప్లాస్టిక్ తీసుకురాకుండా తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. గద్యగూడ, సిమిలిగూడ జంక్షన్లో ప్లాస్టిక్ వ్యర్థాలు బీరు బాటిల్స్ పేరుకుపోయి ఉన్నాయి. వాటిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

గమ్యానికి దారేదీ..?

అధ్వానంగా నర్సింగ్‌పేట - పెద్దమడపల్లి రోడ్డు
రాళ్లు తేలిన మార్గంతో అవస్థలు
పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

రాళ్లు తేలిన నర్సింగ్‌పేట - పెద్దమడపల్లి రోడ్డు

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని నర్సింగ్‌పేట నుండి పెద్దమడపల్లి వరకూ 15.2 కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రహదారికి 43.3 లక్ష లు వైసిపి హయాంలో మంజూరు చేశారు. మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి శంకుస్థాపన చేసి వదిలేశారు. ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ అప్పట్లో వైసిపి ప్రభుత్వ హయాంలో నాయకులు పట్టించుకోలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా రోడ్డు పనులు చేపట్టలేదని వాపోతున్నారు. ఈ రహదారి మొత్తం కంకర తేలిపోయి నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మమ్మల్ని గెలిపిస్తే అధికారంలోకి రాగానే ఈ రోడ్డు పూర్తి చేస్తామని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని గెలిచారని ఇంతవరకూ ఇటువైపే చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే రహదారులు, మా బతుకులు మారుతాయని అనుకున్నామని కానీ గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా తయారైందని వారు ఎద్దేవా చేశారు. మెయిన్‌రోడ్డు నుంచి కారంగూడెం, జల్లివారిగూడెం నుండి ముల్కనపల్లి వరకూ మెయిన్‌రోడ్డు నుంచి వీరపాపన్న కుంట వరకూ పెద్దమట్టపల్లి నుండి కుందులూరు మీదుగా టేకులూర్ వరకూ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అంబులెన్స్ ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆసుపత్రులకు వెళ్లాలన్నా నిత్యావసర సరుకులకు మండలానికి వెళ్లాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆసుపత్రికి రేఖపల్లి వెళ్లాలంటే చాలా అవస్థలు పడుతున్నామని గర్భిణులకు అయితే దారి మధ్యలోనే ప్రసవాలు అవుతున్నాయని ఏడు సంవత్సరాలుగా మేము పడుతున్న బాధ ప్రభుత్వాలు గుర్తించట్లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏది కావాలన్నా మండల కేంద్రం రేకపల్లికి వెళ్లాల్సి వస్తుందన్నారు. రహదారి బాగుచేయాలని ఐటిడిఎ కు ఎన్నిమార్లు వినతిపత్రాలు ఇచ్చినా బుట్టదాఖలయ్యాయని ఇప్పటికైనా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే మిర్యాల శిరీషదేవి ఐటిడిఎ పిఒ స్పందించి రహదారి బాగుచేయని పక్షంలో ఆయా గ్రామస్తులంతా ఐటిడిఎ ముందు దీక్ష చేపడతామని హెచ్చరించారు.

చివరి నిర్వాసితుని వరకూ పరిహారం

ఆర్‌అండ్‌ఆర్‌పై అందోళన వద్దు
సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్

ప్రజాశక్తి - చింతూరు: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చివరి నిర్వాసితుల వరకు పరిహారంతో పాటు వారు కోరిన పునరావాసాన్ని కల్పించడం జరుగుతుందని ఎవరు అధైర్య పడవద్దని సబ్ కలెక్టర్ ఐటిడిఎ పిఒ శుభం నో కాల్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిహారం 600 కోట్లు విడుదలయ్యాయని చింతూరు, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో 32 గ్రామాలకు చెందిన గిరిజనులకు సంబంధించి ఇప్పటికి 22 గ్రామాల్లో వారికి భూమికి భూమి ఇవ్వటం జరిగిందని, మిగిలిన వారికి తరువాత అందిస్తామన్నారు. జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం గ్రామాల్లో 66 శాతం మంది గిరిజనులకు అంగీకారం తెలపడం జరిగిందని, నాన్ ట్రైబల్‌కు 3,600 మందికి వారు కోరిన చోట కేటాయింపు జరుగుతుందని ఇప్పటివరకు డివిజన్ వ్యాప్తంగా 12,362 అర్హత కలిగిన వారు నమోదు కాగా 9,664 మంది వెరిఫికేషన్‌లో ఉన్నారని వారిని కూడా తగిన ధ్రువపత్రాలు తీసుకొస్తే అర్హులను చేసే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన వారి జాబితాను తహశీల్దార్ కార్యాలయం, సచివాలయాల్లో జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. అప్పటికి ఇంకా ఎవరైనా అర్హత లేనివారు ఉన్నట్లయితే మళ్లీ సిబ్బందిని సంప్రదించి తగిన ఆధారాలు, ధ్రువపత్రాలు అందించాలని తెలిపారు. కార్యక్రమం ఇంతటితో ముగియదని, చివరి నిర్వాసితుల వరకూ అందరికీ న్యాయం జరిగే వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఎవరు అధైర్య పడవద్దని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మూడు నెలల్లో 6,000 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ పూర్తి చేసి ప్రకటిస్తామన్నారు. వెరిఫికేషన్‌లో మూడు మండలాలకు సంబంధించి 1000 మందికి వెరిఫికేషన్ పూర్తి కాగా 800 మందికి ఇంకా అర్హత పొందాల్సి ఉందన్నారు. మిగతా నాలుగు వేల మందికి పది రోజుల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి ప్రకటిస్తామన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలి

డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి -సీలేరు: మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ కొత్త బిల్లును కేంద్రం తీసుకురావడం వారి పరాకాష్టకు నిదర్శమని డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జికె వీధి మండలం సీలేరు హైస్కూల్ గ్రౌండ్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గాంధీజీ పేరుపై ఉన్న జాతీయ హామీ ఉపాధి పథకాన్ని కొనసాగించా లని నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వామపక్షాలు దీన్ని వ్యతిరేకిస్తున్నా బిజెపి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఇటువంటి విధానాలకి స్వస్తి పలకాలని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి మోడీ ఇతర దేశాలకు వెళ్లేటప్పుడు మహాత్మా గాంధీ గొప్పతనం గురించి వివరిస్తూ మరోపక్క ఆయన పేరుపై ఉన్న ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ఇది ఎంతవరకూ సమంజసం అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలకు స్వస్తి పలికి రాజ్యసభలో తీసుకుని నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. చట్టాన్ని రద్దు చేసే వరకూ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని హెచ్చరించారు. వ్యవసాయ సంక్షోభంలో ఉన్న ప్రజానీకానికి కనీసం 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకి 600 రూపాయలు చొప్పున కూలి రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ బాబురావు దుప్పిలివాడ సర్పంచ్ అల్లంకిరాజు నాయకులు సొన్ను, అప్పారావు, సత్తిబాబు, రాంబాబు, మల్లుదొర, శ్యామ్‌సన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..!

టిడిపి మండల అధ్యక్షులు
పాత్తూరి కొండలరావు

సమస్యలు తెలుసుకుంటున్న కొండలరావు

ప్రజాశక్తి- జికేవీధి: మండలంలో సంకాడ పంచాయతీ పరిధిలోని పలు సమస్యలు పాడేరు టిడిపి ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి మండల అధ్యక్షుడు పొత్తూరి కొండలరావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన సంకాడ పంచాయతీలో పర్యటించారు. ఆయా గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. వసువాడ, మెట్టవీధి బచ్చెలగొంది గ్రామల మీదుగా గోవాడ గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల తారురోడ్డు నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు ఇళ్లు మంజూరు చేయాలని పలువురు కోరారు. సమస్యలను టిడిపి పాడేరు ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కూటమి నాయకులు నాగమణి, నాగేంద్ర గోవిందరావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

సీలేరు : విద్యుత్‌దీపాల వెలుగులో యూసిఐఎం చర్చి

క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న గిడ్డి ఈశ్వరి తదితరులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో క్రిస్మస్ వేడుకలు ముందస్తుగా ప్రారంభమయ్యాయి. యూసిఐఎం, గేస్తేమనే, పెంతుకోస్తు కల్వర్ చర్చి, బచ్చులూరులో చైతన్య చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ముందుగానే సెమీ క్రిస్మస్ వేడుకలలో భాగంగా సీలేరు పురవీధుల్లో రాత్రి 7 గంటలకు తిరుగుతూ గీతాలుఅలాపిస్తూ సందడి చేస్తున్నారు. ప్రతిరోజు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. దీంతో చర్చిల్లో సందడి వాతావరణం నెలకొంది.

పాడేరుటౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కుమ్మరిపుట్టులో మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం గ్రాండ్ క్రిస్టమస్ వేడుకలు ఘనంగానిర్వహించారు. పాస్టర్ జి.తిమోతి అధ్యక్షతన వేడుకకు వాక్యోపదేశకులుగా యుసివైఎ ఫౌండర్ చీఫ్ జాన్ రీమలి, ముఖ్య అతిథులుగా పాస్టర్లు బుచ్చియ్య, జాన్‌ఫెడ్రిక్, వైవై.రత్నం, శామ్యూల్, ఇజ్రాయేలురాజు, బిల్లీ గ్రేహం, డానియల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసుక్రీస్తు చూపిన బాటలో అందరూ నడవాలని, తద్వారా సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. క్రిస్టమస్ కేక్ కట్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్టమస్ కానుకగా చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవింద్ మాస్టారు, బొర్రా నాగరాజు, విజయరాణి, డి.వెంకటరమణ, సురేష్, వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు, పాల్గొన్నారు.

మూగబోయిన బిఎస్ఎన్ఎల్ సేవలు

పైనంపాడులోని బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని మారుమూల పైనంపాడు పంచాయతీలో ఉన్న ఏకైక బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ సాంకేతిక సమస్యలతో వారం రోజులుగా సిగ్నల్స్ నిలిచిపోయి మూగబోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ నిలిచిపోవడంతో సెల్‌ఫోన్లతోపాటు ఇతర కమ్యూనికేషన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సచివాలయాల్లో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రతినిత్యం అవసరానికి ప్రజలు, వినియోగదారులు అవస్థలు పడ్డారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి సెల్‌సేవలకు అంతరాయం కలుగుతున్నా సంబంధిత బిఎస్ఎన్ఎల్ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని, ఇప్పటికైనా సెల్‌టవర్ వద్ద నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి, సెల్‌సేవలను పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని తాజంగి గ్రామపంచాయతీ పరిధిలోని బసింగి కొత్తూరు గ్రామంలో ఎంపీపీ నిధులతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ వంతల మహేశ్వరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం నుంచి పాఠశాల వరకు సరైన రహదారి లేకపోవడంతో చిన్నారులు, గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యను ఎంపీపీ అనూష దేవికి తెలియజేయగా, వెంటనే రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కిలో సదాశివ, మాజీ ఎంపీటీసీ అంగదరావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పిసిసిఎఫ్) డాక్టర్ పి.వి.చలపతిరావు తెలిపారు. అంతరించిపోతున్న సముద్ర జీవులు, సముద్ర తాబేళ్ల మరణాలను తగ్గించడానికి అవగాహన కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో ట్రీ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల బయోస్కోపు మందిరంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పిసిసిఎఫ్ చలపతిరావు, అడిషనల్ పిసిసిఎఫ్ డాక్టర్ శాంతి ప్రియా పాండే సముంద్ర జీవుల మనుగడపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, ఆలివ్ రెడ్లే తాబేళ్ల కోసం గత ఏడాది 6.8 లక్షల గుడ్లను పొదిగించగా వాటిలో 2.4 లక్షల పిల్లల్ని పలు ప్రాంతాల్లో సముద్రంలోకి విడిచి పెట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ సర్కిల్ సిఎఫ్ బిఎం.దివాన్ మైథీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, వివిధ జిల్లాల డిఎఫ్ఒలు రవీంద్ర భీమా, వెంకటేష్, ప్రసన్న, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా

●పీసా మహోత్సవ్‌లో భాగంగా కేంద్రబృందం పర్యటన

●మూడు బృందాలుగా పాల్గొన్న పది రాష్ట్రాల ప్రతినిధులు

గిరిజనులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి -అనంతగిరి : పీసా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని చిలకలగెడ్డ, కాశీపట్నం, కొండిబ పంచాయతీల పరిధిలోని సచివాలయాల్లో కేంద్ర కమిటీ సభ్యులు గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. పది రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, స్థానిక జిల్లా, మండలస్థాయి అధికారులతో కలిసి 20మంది చొప్పున మూడు బృందాలుగా ఏర్పడి,ఆయా గ్రామాల్లో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. గిరిజనుల ఆరోగ్య స్థితిగతులు, జీవనాధారాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య సిబ్బంది గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పూర్వపు విలువిద్య వస్తువులను ప్రదర్శించారు. గిరిజన ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు కేంద్ర బృంద అధ్యయన కమిటీ, పీసా, ఉపాధి హామీ. వంటి పథకాలు అమలుతీరుపై మూడు బృందాలుగా పరిశీలన చేశారు.

కార్యక్రమంలో కేంద్ర బృందం కమిటీ ఉపాధ్యక్షులు పడాల .త్రినాథ్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (పీసా) చట్టం 1996లో తీసుకొచ్చారని, గిరిజన షెడ్యూల్డ్ భూములకు పంచాయతీరాజ్ నిబంధనలు విస్తరించి, ఆ భూములను సంరక్షించుకునే అధికారాన్ని ఈ చట్టం కల్పిస్తోందన్నారు. ఏటా పంచాయతీరాజ్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా పీసా మహోత్సవ్ నిర్వహిస్తున్నారన్నారు. చట్టంపై అవగాహన పెంచడం, భూమి, సహజ వనరులపై అవగాహనతో సహజ వనరులను పరిరక్షణకు తమవంతుగా సంసిద్ధం కావాలని తెలిపారు.పీసా చట్టాన్ని సమర్థంగా అమలు చేసేందుకు పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టిందని విధాన సంస్కరణలు, సామర్థ్య నిర్మాణం, సాంస్కృతిక డాక్యుమెంటేషన్, డిజిటల్ సహాయం, కమ్యూనిటీ నేతత్వంలోని పాలనా ప్రయత్నాలు, గ్రామ సభల బలోపేతం వంటివి చేపడుతున్నారు. రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిలల లక్ష మందికి శిక్షణ ఇచ్చారన్నారు.

ఈ సందర్భంగా డ్వాక్రా మహిళ కనకదుర్గ మాట్లాడుతూ తాము గ్రూపు ద్వారా రూ.20 లక్షల రుణం తీసుకుని ఎటువంటి బయట వడ్డీల బెడద లేకుండా వ్యాపారాన్ని సాగిస్తూ నెలసరి రూ.20 వేల వరకు ఆదాయాన్ని పొందుతూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. తీసుకున్న రుణాలకు వడ్డీతో రుణవాయిదాలను సక్రమంగా చెల్లిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కొండిబ గ్రామ పెద్ద గుజ్జల మధుసూదన్ మాట్లాడుతూ జిఒ 3 రద్దుతో గిరిజనులు ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని, దాన్ని పునరుద్ధరించాలని, లేకుంటే ప్రత్నామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. పలు గ్రామాలకు కనీసం రోడ్డు, ఇతర మౌలిక సౌకర్యాలు లేని పరిస్థితి ఉందని కేంద్రబృందం దృష్టికి తెచ్చారు గిరిజన ప్రాంతాలలో . ఉపాధి గ్రామీణ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు.. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకరరావు, తహశీల్దార్ వీరభద్రాచారి, వెలుగు ఎపిడి అప్పారావు, ఎపిఎం రమేష్, రాష్ట్ర సంక్షేమ బోర్డు డైరెక్టర్ జోగులు, డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, గ్రామస్తులు మధుసూదన్, కొండప్ప, సుబ్బారావు, దయానిది గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పీసా కమిటీ కార్యదర్శి రామరాజు, జగన్, సభ్యులు, అప్పలరాజు, రాజు, అంగన్వాడి సిబ్బంది,.ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పీసా మండల కమిటీ నూతన కార్యవర్గం

ఎన్నికైన పీసా మండల కమిటీ కార్యవర్గం

ప్రజాశక్తి- అరకులోయ : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పీసా కమిటీ ఎన్నిక మంగళవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 14 గ్రామపంచాయతీల పీసా కమిటీ ప్రతినిధులు పాల్గొని మండల కమిటీని ఎన్నుకున్నారు. పీసా మండలకమిటీ అధ్యక్షుడిగా బొండం గ్రామ పీసా కమిటీ అధ్యక్షుడు సుంకరి ఆనందరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పొద్దు బాలదేవ్, ప్రధాన కార్యదర్శిగా కిల్లో జగన్నాథం, ఉపాధ్యక్షులుగా మోస్య రంజిత్ కుమార్, కోశాధికారిగా కిల్లో మహేష్, జాయింట్ సెక్రటరీగా పాంగి రవికుమార్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా కొర్రా జగబంధు, పాంగి నాగేశ్వరరావు, తామల అప్పారావు, కొర్రబోడన్న, జె వినయ్, పి మిన్ను, ఎస్ సంతోషం, కె.దేవదాస్, మల్లన్న, నర్సింగరావు, కె కామేష్, కె అర్జున్ ఎన్నికయ్యారు.ఈ కమిటీ ఎన్నికలలో మండలానికి చెందిన112మంది పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై పీసా కమిటీ వినతి

కాశీపట్నం: అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీలో పీసా చట్టం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సారవానిపాలెం పీసా క్లస్టర్‌కు చెందిన సారవానిపాలెం,సీతంపేట గ్రామాలకు బీటి రోడ్లు, సీతంపేటకు గోస్తని నదిపై వంతెన నిర్మాణం మొదలగు సమస్యలపై చర్యలు తీసుకోవాలని పీసా కార్యదర్శి కాకర సింగులు డిమాండ్ చేశారు.

ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురాజు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే కుట్రలను మానుకుని, పేదల జీవనోపాధి కల్పించేలా పటిష్టంగా అమలు చేయాలని ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ 2005లో వామపక్ష పార్టీల ఉద్యమంతో ఉపాధి హామీచట్టం అమల్లోకి వచ్చిందని, దీనిద్వారా దేశవ్యాప్తంగా కోట్లమంది ప్రజలకు ఉపాధి దొరికి ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అటువంటి చట్టాన్ని పేరుమార్పు, సంస్కరణలో పేరుతో నిర్వీర్యం చేయాలని కేంద్రం కుట్రపన్నుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలుకు చర్యలు చేపట్టాలని,ఉపాధి కూలీల బకాయిపడ్డ వేతనాలను వెంటనే ఇవ్వాలన్నారు. అర్హులైన పేదకుటుంబాలకు పని హక్కు కల్పించి, ఏటా 200 రోజులు రోజులు పని దినాలు కల్పించాలని, కనీస దినసరి వేతనం రూ. 600 చెల్లించాలని కోరారు. ఉపాధి చట్టంలో నిర్దేశించిన విధంగా పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారీ ఎత్తున ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

వంట సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్, తదితరులు

వంట సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని పెదబరడ గ్రామ పంచాయతీ సర్పంచ్ సమిడి గోపాల్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వంట సామాగ్రి పంపిణీ చేశారు. పెదబరడ పంచాయతీ పరిధిలోని సిరిపురం, తెరపల్లి, కృష్ణపురం గ్రామాల్లో గ్రామస్తులకు అండాలు, బకెట్లు అందజేశారు. గ్రామస్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పండుగ వేళ ఇటువంటి సహాయ కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొబైల్ రికవరీ మేళా

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ ఆవరణలో మంగళవారం మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. జిల్లా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గడచిన మూడు నెలల్లో ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ స్వయంగా బాధితులకు అందజేశారు. రికవరీ చేసిన రూ. 5.45 లక్షల విలువైన 51 మొబైల్ ఫోన్లను అందజేశారు.
ఈ సందర్భంగా ప్రజలు పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ల రికవరీకి నిరంతర కృషి చేస్తున్న ఎస్ బి ఇన్స్పెక్టర్ బి అప్పలనాయుడు , సిబ్బందిని అభినందించారు.
కేవలం అల్లూరి జిల్లాలోనే కాకుండా, పొరుగు జిల్లాలైన తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, విజయవాడ, ఖమ్మం ఇతర జిల్లాలతోపాటు.. ఇతర రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, తెలంగాణ ప్రాంతాల నుండి జిల్లా యంత్రాంగం ఈ ఫోన్లను రికవరీ చేసిందని ఎస్‌పి అమిత్‌బర్ధర్ వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు మొత్తం 180 మొబైల్ ఫోన్లను రికవరీ చేసామని, వీటి మొత్తం విలువ సుమారు రూ. 27 లక్షలు ఉంటుందని ఎస్‌పి తెలిపారు.

మొబైల్ రికవరీ మేళాలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి అమిత్‌బర్ధర్

పిఒ శుభంనొక్వాల్‌ను కలసిన దేవాలయ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రావు

తెప్పోత్సవానికి బందోబస్తు కల్పించండి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: మండలంలో శ్రీరామగిరి పంచాయతీ శ్రీరామగిరి గ్రామంలో ఏటా ఘనంగా జరిగే ముక్కోటి ఏకాదశి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న తెప్పోత్సవ కార్యక్రమానికి బోటుకు అనుమతి ఇవ్వాలని మంగళవారం శ్రీరామగిరి దేవాలయ కమిటీ చైర్మన్ పెందుర్తి సుదర్శన్‌రావు చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్, ఎఎస్‌పి బొడ్డు హేమంత్‌ను కలిసి కోరారు. అదేవిధంగా బందోబస్తు విషయమై వారితో మాట్లాడి వారిని ఊరేగింపు కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, టిడిపి నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరకా సూర్యప్రకాష్‌రావు, ఎండోమెంట్ అధికారి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.


అప్పారావుని పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ఎంపిటిసికి వైసిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - జికెవీధి : ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న కొయ్యూరు వైసిపి మండల అధ్యక్షులు, డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావుని తన నివాసంలో జికె వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, జికె వీధి ఎంపిపి బోయిన కుమారి, మండల వైసిపి నాయకులు మంగళ వారం పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని త్వరగా కోలుకోవా లని ఆక్షాంక్షించారు. మండల ఉపాధ్యక్షులు రీమల బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ ఆయనను పరామర్శించిన వారిలో ఉన్నారు.

శ్రీ జగదాంబ పెరల్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ముత్యాల ఆభరణాల రంగంలో వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ప్రముఖ సంస్థ 'శ్రీ జగదాంబ పెరల్స్ తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ విశాఖపట్నంలో కొత్త స్టోర్‌ను మంగళవారం ప్రారంభించింది. సంస్థ మేనేజింగ్ పార్టనర్ అవనీష్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగదారులు ఆభరణాల విషయంలో స్వచ్ఛత, సర్టిఫికేషన్ ఆధునిక డిజైన్ల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. విశాఖ ప్రజలకు నమ్మకమైన సేవలను అందించడమే తమ లక్ష్యం అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నాలుగు, బెంగళూరులో రెండు స్టోర్లు ఉన్నాయన్నారు. అనంతరం మార్కెటింగ్ విభాగం హెడ్ దీపక్‌కుమార్ మాట్లాడుతూ, విశాఖ వంటి కొత్త నగరాల్లో విస్తరణ ద్వారా వచ్చే ఏడాదిలో తమ ఆదాయం 10 నుంచి 15 శాతం మేర పెరుగుతుందన్నారు. ముత్యాలు, ల్యాబ్-గ్రోన్ డైమండ్స్‌తో రూపొందించిన 2,000 కంటే ఎక్కువ డిజైన్లు అందుబాటులో ఉంటాయన్నారు. రాబోయే రోజుల్లో 20 నుండి 25 స్టోర్లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

మిస్ యూనివర్స్ ఇండియా 2025గా సృజనదేవి

జైపూర్ గ్రాండ్ ఫినాలేలో ఎంపిక

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సృజనదేవి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖపట్నానికి చెందిన డాక్టర్ ఎం.సృజనదేవి జాతీయస్థాయిలో సత్తా చాటారు. జైపూర్‌లో జెడ్‌స్టూడియోస్‌లో వైభవంగా జరిగిన 'ఫారెవర్ మిస్ యూనివర్స్ ఇండియా 2025' గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం విశాఖ బీచ్‌రోడ్‌లోని అంబికా సిగ్రీన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'బ్యూటీ అంటే కేవలం వేషధారణ మాత్రమే కాదు, అది సమాజానికి మనం చేసే సేవలో కూడా ఉంటుందన్నారు. ఈ విజయం నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఫొరెవర్ స్టార్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు 10,000 మంది పాల్గొన్నారు. 100 మంది ఫైనలిస్టులు జైపూర్‌లో జరిగిన తుది పోరులో తలపడ్డారన్నారు. ఈ పోటీలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం, మేధస్సు మరియు సామాజిక అంశాలపై ఉన్న అవగాహన వంటి అన్ని విభాగాల్లో డాక్టర్ సజన తనదైన శైలిలో రాణించి న్యాయనిర్ణేతల మనసు గెలుచుకున్నారు. వత్తిరీత్యా ఎండి (అనస్థీషియా) పూర్తి చేసిన ఆమె, ప్రస్తుతం అనస్థీషియాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. కోవిడ్ సమయంలో సుమారు 30,000 మంది రోగులకు సేవలందించి 'భారత్ గౌరవ్ పురస్కార్' అందుకున్నారు. 'నేషనల్ అటల్ అవార్డు 2025' వంటి మరెన్నో పురస్కారాలు పొందారు. ఐఎంఎ జూనియర్ డాక్టర్స్ నెట్ వర్క్ ఆంధ్రప్రదేశ్, నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

వీఎంఆర్‌డిఎ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: వీఎంఆర్‌డీఎ చిల్డ్రన్స్ ఏరీనాలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరిచినందుకు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం చిల్డ్రన్స్ ఏరీనా ప్రాంగణంలో ఎటువంటి రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం పూర్తిగా నిషిద్ధం. అయితే, ఇటీవల అక్కడ ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన బ్యానర్లు వెలిసినప్పటికీ, స్థానిక పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న కిరణ్‌కుమార్ వాటిని అడ్డుకోవడంలో విఫలమయ్యారు. అంతేకాకుండా ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు.

హెచ్ఐవి కేసులు తగ్గుముఖం

శాసనసభ సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ తోట త్రిమూర్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో హెచ్ఐవి కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లే టివ్ కమిటీ చైర్మన్ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. కమిటీ రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కెజిహెచ్‌లో గైనకాలజీ వార్డును పరిశీలించి అక్కడ వైద్యం తీసుకుంటున్న వారిని కలసి వారికి అందుతున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను బాధితుల కు క్రమం తప్పకుండా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారని వెల్లడించారు. పీజీ వైద్య విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన 85, 127 జిఒలను సమీక్షించినట్లు తెలియజేస్తూ ప్రభుత్వ కోటా కింద రాయితీలు, స్టైపెండ్ పొందే వైద్యులు కనీసం 10 ఏళ్ల పాటు గ్రామీణ ప్రాంతాల్లో లేదా ప్రభుత్వ సేవలో పనిచేయాలనే నిబంధనను గుర్తు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు వైద్యుల పీజీ సర్టిఫికేట్లు రద్దు చేయడంతో పాటు రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

పూర్ణా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

- రూ.50 లక్షల ఆస్తి నష్టం

దగ్ధమైన షాపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలో ఎంతో ప్రసిద్ధి చెందిన పూర్ణా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున పూర్ణా మార్కెట్‌లో పూజాసామగ్రి విక్రయించే దుకాణాల వద్ద అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందడంతో అగ్నిమాపక దళ సిబ్బంది, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో 16 దుకాణాలు దగ్ధమయ్యాయి. వీటిలో 14 పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు ఉండగా, మరో రెండు ఉసిరికాయలు, వెలంకాయలు, మామిడి ముక్కలు, ప్లాస్టిక్ సామగ్రి విక్రయించే షాపులు ఉన్నాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని సూర్యా బాగ్ అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. ప్రమాద వార్త తెలియడంతో ఉదయం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సంబంధిత అధికారులతో కలిసి పూర్ణా మార్కెట్‌కు వెళ్లి ప్రమాదంలో దగ్ధమైన దుకాణాలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. తగిన ఆర్థిక సాయం అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావు కూడా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరగడం వల్ల ఎటువంటి ప్రాణ నష్టమూ జరగలేదన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఇద్దరు వాచ్‌మ్యాన్లను ఏర్పాటు చేయాలని, నైట్ పెట్రోలింగ్ కోసం పోలీసులకు తెలపాలని జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడును ఆదేశించారు. రాష్ట్రంలోనే ఒక ఆధునిక మార్కెట్‌గా పూర్ణా మార్కెట్‌ను తీర్చిదిద్దడానికి అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, డిడిహెచ్ దామోదర్ రావు, తాగునీటి విభాగం, పబ్లిక్ వర్క్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కూడా పూర్ణా మార్కెట్ అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వన్ టౌన్ పోలీసులు ప్రమాదంపై ఆరా తీశారు.

రోబోటిక్ సర్జరీతో కిడ్నీ చికిత్సలో నూతన శకం

విశాఖ ఎంపీ శ్రీ భరత్

రోబోటిక్ టెక్నాలజీ ప్రారంభిస్తున్న ఎంపి శ్రీభరత్

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్: విశాఖపట్నం ఎఐఎన్‌యు ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీలతో కిడ్నీ చికిత్సలో కొత్త ప్రమాణాలను ఆవిష్కరించడం హర్షించదగిన విషయమని విశాఖ ఎంపి మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. దక్షిణ నియోజకవర్గం ద్వారకానగర్ మొదటి వీధిలో ఉన్న ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు)లో ప్రవేశపెట్టిన రోబోను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని ప్రవేశపెట్టడం అనేది కొత్తశకం అవుతుందన్నారు. విశాఖ పురోగతి ని ఇలాంటి అత్యాధునిక టెక్నాలజీలు రుజువు చేస్తాయన్నారు. కిడ్నీ చికిత్సల్లో రోబోటిక్ విధానం వల్ల రోగులకు సురక్షితమైన చికిత్స, వేగంగా కోలుకోవడం సాధ్యమవుతాయన్నారు. ఎఐఎన్‌యు విశాఖ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్, యూరో ఆంకాలజిస్ట్, లాపరోస్కొపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ జి.రవీంద్రవర్మ మాట్లాడు తూ, ఈ అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో తాము సంక్లిష్టమైన సర్జరీలను కూడా కచ్చితత్వంతో చేయగలమన్నారు.రోగికి నొప్పి తగ్గుతుందని, మచ్చలు ఉండవని, త్వరగా కోలుకుంటారన్నారు. ప్రొస్టేటిక్ క్యాన్సర్ కేసుల్లో, ముఖ్యంగా రాడికల్ ప్రొసెక్టమీ చేయాల్సి వచ్చినప్పుడు కణితిని కచ్చితంగా తీయగలమ న్నారు. రక్తస్రావం తగ్గుతుందన్నారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెం ట్ యూరాలజిస్ట్, యూరోఆంకాలజిస్ట్, లాపరోస్కొపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ అమిత్ సాప్లే మాట్లాడుతూ, సంక్లిష్టమైన సమస్యలకు రోబోటిక్ సర్జరీలు సమూలంగా మారుస్తాయన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆస్పత్రి సిఇఒ సందీప్ గూడూరు తదితరులు మాట్లాడారు.

నీరుస్ స్టోర్ ప్రారంభిస్తున్న దృశ్యం

వైభవంగా నీరుస్ న్యూలుక్ స్టోర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రముఖ భారతీయ సంప్రదాయ వస్త్ర వ్యాపార సంస్థ 'నీరుస్' తన ఫ్లాగ్‌షిప్ స్టోర్ సిరిపురం సంపత్ వినాయక ఆలయ రోడ్డులో మంగళవారం ప్రారంభించింది. కార్యక్రమంలో నీరుస్ ఎండీ అవినీష్ కుమార్, హెడ్ డిజైనర్ ప్రియాకుమార్, సుచితా అహూజా, ఎఫ్ఐసిసిఐ ఎఫ్ఎల్ఓ విజయవాడ చైర్‌పర్సన్ అమృతకుమార్, వైస్‌చైర్‌పర్సన్ రజినీచిత్ర ప్రముఖ సామాజికవేత్త గంటా శారద అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నీరుస్ ఎండీ అవినీష్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వస్త్రాల వారసత్వాన్ని కాపాడుతూనే, నేటి తరం అభిరుచులకు అనుగుణంగా ఆధునికతను జోడించడంలో నీరుస్ ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. ఈ స్టోర్‌లో సంప్రదాయ వస్త్రధారణను సమకాలీన శైలిలో ప్రదర్శించారు. ముఖ్యంగా 'సిగ్నేచర్ డ్రేప్స్' (చీర కట్టే విభిన్న శైలులు) ప్రదర్శన అతిథుల దృష్టిని ఆకర్షించింది.